

చెహోవ్ కథ

ఆ శిశిరకాలపు సాయంత్రం జ్ఞాపకం వచ్చింది. కిటికీ తెరవగానే మొహానికి తగిలిన చల్లని గాలి. సూట్ కేస్ కిందపెట్టి, మరో చేతిలో రెవెన్యూ గణాంక వివరాల లెడ్జర్లను సరిచూసుకొని తలుపుతట్టాడు ఇవాన్.

దీపం పెద్దది చేసి, బట్టతల నిమురుకుంటూ వచ్చి తలుపు తీశాడు గాబ్రిల్.

'వీడ్కోలిప్పించండి' అన్నాడు ఇవాన్ షేక్ హాండ్‌కు చెయ్యిచాచి.

పూలపొదల మీద ఆడుకుంటోంది చిరుగాలి. దీపం వెలుగులో యిద్దరి నీడలూ పొడుగాటి చెట్లలా పరుచుకున్నాయి.

'మీ ఆతిథ్యంలో ఎంత సంతోషంగా, ఎంత అద్భుతంగా గడిచాయి రోజులు. మీ స్నేహాన్ని, ఈ జన్మలో మరిచిపోలేను. మీరూ, మీ అమ్మాయి నన్ను సొంతమనిషిలాగ చూసుకున్నారు. మీరు చిరకాలం యిలాగే సుఖంగా వుండాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నాను. ' ఉద్వేగంతో గద్గదమైంది ఇవాన్ గొంతు. కళ్లు చెమర్చాయి.

'గవర్నమెంటు పనిమీద వచ్చాను. మీ ఇంటి అతిథిగా గడిపాను. ఏ ముహూర్తాన మనకు పరిచయం కలిగిందోగాని రోజూ మీ యింటి భోజనానికి అలవాటు పడ్డాను. ఛ. యిలాంటివి మాటల్లో చెప్పకూడదు. చెప్పలేం. మీ స్నేహంతో, మీ అమ్మాయి పరిచయంతో విసుగుపుట్టించే గవర్నమెంటుపని కూడా ఆడుతూ పాడుతూ చేసుకోగలిగాను. ఇంతదూరం, ఈ చిన్న వూరికి మళ్లీ వచ్చే అవసరం కలుగుతుందనుకోను. మీ అమ్మాయి కనిపించలేదు. ఆమెకు నా కృతజ్ఞతలు చెప్పండి. థాంక్స్, గుడ్‌బై.'

ఇవాన్ ఒక్కసారి గాబ్రిల్‌ను గాఢంగా కౌగలించుకొని మెట్లు దిగాడు.

'ఇలాగే ఎప్పుడో ఎక్కడో కలుస్తాంలెండి' అన్నాడు గాబ్రిల్.

'తప్పకుండా. మీరు పీటర్స్ బర్గ్ వచ్చినప్పుడు తప్పక నా ఆతిథ్యం స్వీకరించాలి.'

'లెడ్జర్లు బరువుగా వున్నట్టున్నాయి. ఇక్కడ వదిలి వెళ్లండి. రేపు పనిమనిషితో మీ అడ్రసుకు పంపిస్తా.' అన్నాడు గాబ్రిల్. కాని అప్పటికే ఇవాన్ గబగబా నడిచి వెళ్లిపోయాడు.

తనలాంటి కొత్తమనిషిని, అపరిచితుణ్ణి కూడా ఎంత ఆప్యాయంగా ఆదరించారు. ఇలాంటి సజ్జనులతో గడపగలిగిన సదవకాశం మళ్లీ ఎప్పుడొస్తుందో! చివరికి మిగిలేదేమిటి? మధుర జ్ఞాపకాల పరిమళాలు. కొత్త కొత్త ఆకారాలు సృష్టిస్తూ కొంగలు ఎగురుతున్నాయి ఆకాశ నీలంలో తెల్లటి చుక్కలు. అజ్ఞాత గాయకుడెవరో దూరంగా పాడుతున్నాడు గాలిలో తేలివస్తున్నది తెలియని పాట. ఈ రెండు మూడు నెలల్లో గాబ్రిల్ యిల్లు తన యిల్లై పోయింది. ఆ అమ్మాయి వెరా పరిచయం తనలో చెరగని ముద్ర వేసింది. ఆ ఇంటి ఆవరణలోని పూలచెట్లు, ప్రభాతవేళ ఆ గార్డెన్ బెంచీలమీద కూర్చొని సూర్యోదయ సౌందర్యానికి మైమరచిపోయిన క్షణాలూ....

తోటలో యింకా నులివెచ్చగా వుంది. పొగాకు పువ్వుల వాసన ఆహ్లాదకరంగా వ్యాపిస్తున్నది. చెట్ల మధ్యన పరచుకున్న మంచుతెరలలోంచి ప్రసరించిన వెలుగు తోటను కాంతిమయం చేసింది.

గేటు దాటబోతుంటే ఆమె కనిపించింది.

# వెరా

**రష్యన్‌మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

'వెరా, యిక్కడున్నారా. చాలాసేపు మీ కోసం చూశాను. ఎనీవే, థాంక్స్. అండ్ గుడ్‌బై'.

'అప్పుడేనా?'

'ఆ. దూరం పోవాలి.'

ఎదురుగా నిల్చుంది వెరా. చిందర వందర దుస్తుల్తో. అలంకరణ మీద ఏ మాత్రం యిష్టంలేని యిరవయ్యొక్క సంవత్సరాల అమ్మాయి, పగటి కలలు కనటం అలవాటైన మనుషులకు సహజంగా కళ్లల్లో కనిపించే బాధ. ఆమె బేలతనమో, ఎప్పుడూ స్వప్నలోకాలను దర్శించే ఆమె కళ్లు ఇవాన్‌కు కాళ్లు కదలకుండా చేశాయి.

'మిమ్మల్నందర్నీ విడిచివెళ్లటం బాధగానే వుంది. కానీ వెళ్లక తప్పదు. మీ ఆతిథ్యం నిజంగా మార్వలెస్. నిజంగా మీకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియటం లేదు.'

'ఇంతకూ యిప్పుడెక్కడికి బయల్దేరారు?'

'మొదట మా అమ్మ దగ్గర ఒకటి రెండు రోజులుంటాను. తరువాత పీటర్స్‌బర్గ్ వెళ్లి డ్యూటీలో జాయిన్ కావాలి.'

'ఆ తర్వాత?'

'ఏముంది. కొన్నాళ్లు ఆఫీసులో పనిచేస్తాను. తరువాత రెవెన్యూ సమాచారం సేకరించడానికి మరో వూరు వెళ్తాను... అబ్బ, మంచు బాగా కురుస్తోంది' అన్నాడు ఇవాన్.

వెరా మంచును చూస్తూ.

'మా ఇంట్లో ఏం మరిచిపోలేదుగా' అంది.

'లేదనుకుంటాను. లేదు.'

'పదండి. అందాకా మీ వెంట వస్తాను.' అంది వెరా.

దారి నిర్మానుష్యంగా వుంది. పొగమంచులో దారి వెదుక్కుంటూ నడవాల్సి వచ్చింది.

'నా వెంట ఎందుకు వస్తున్నవి? మళ్లీ ఈవిణ్ణి దిగబెట్టటానికి యింటిదాకా వెళ్లాలి కాబోలు' అనుకున్నాడు ఇవాన్.

'అబ్బ. మీ వూరు ఎంత అందంగా వుందో. మీ ఆతిథ్యం ఎంత అద్భుతంగా వుందో. వెళ్లడానికి అస్సలు మనస్కొప్పటం లేదు. కాని తప్పదు. పీటర్స్ బర్గ్‌లో ఆ చిన్న గదుల్లో ఎలుకల్లాగ బతికే మేం'

'ఎందుకలాగ బతుకుతారు మరి?'

'తెలియదు. పనిలోనే యించుమించు రోజంతా గడిచిపోతుంది. తరువాత, కాస్సేపు ఎక్కడ పడుకున్నా ఒకటే....

నిశ్శబ్దంగా నడక సాగింది. ఇన్నాళ్లూ మహానగరంలోని మురికి గదుల్లో బతికిన తను ఈ చిన్న వూళ్లల్లో వుదయాలు, సాయంత్రాలు ఎంత ప్రశాంతంగా, ఎంత తీరికగా వచ్చిపోతాయో గమనించనే లేదు. ఎన్నిరకాల పక్షుల అరుపులో, ఎన్ని పువ్వుల వాసనలో. జీవితం నెమ్మదిగానే సాగినా, యిన్ని నెలల తన పని అప్పుడే ముగిసిందా అనిపిస్తున్నది. విసుగు, ఒంటరితనం, ఎవరూ ఎవర్నీ పట్టించుకోనితనం, యిబ్బందులు తప్ప మరేమీ దొరకవని వచ్చాడు. కాని ఎంత స్నేహం, ఎంత ఆప్యాయత తనను పెనవేసుకుంటున్నాయి.

'హా. ఈ గాలి పిలుస్తుంటే ఎంత హాయిగా వుంది. మీరెంత అదృష్టవంతులో...' అన్నాడు

ఇవాన్, ప్రేమతో, వాత్సల్యంతో తనను ముగ్ధుణ్ణి చేసిన మంచి మనుషుల్ని జ్ఞాపకం చేసుకుంటూ.

'ఇంత చదువుకునీ ఎందుకు పట్టణాల్లో అంత అనారోగ్యకరంగా బతుకుతామో తెలియదు.'

మరికాసింత దూరం నడిస్తే బ్రిడ్జి వచ్చింది.

'ఇంకెంతదూరం వెడతాం'.

'ఒక్క నిమిషం యిలా కూర్చుందాం రండి'. అంది వెరా.


'మరో పదేళ్లలో మనం కలుసుకున్నామనుకోండి. ఎలా వుంటావుంటారప్పుడు?' అన్నాడు. ఇవాన్ నవ్వుతూ, 'పెళ్లి చేసుకొని గంపెడు పిల్లల్తో మీరూ, నా రెవెన్యూ లెక్కల పుస్తకాల కట్టలతో నేనూ... నిజానికి అప్పుడు ఈ రోజులు, ఈ అనుభవాలు జ్ఞాపకం వుంటాయంటారా? ఏమంటారు?'

ఏదో ఆలోచిస్తున్న వెరా వులిక్కిపడి 'ఏమిటి?' అంది.

'పదేళ్ల తరువాత...'

'మీరు చెప్పిందేమీ నేను వినలేదు, సారీ' అంది వెరా. మొహం కళ తప్పింది. ఊపిరి బిగపట్టి వుద్వేగాన్ని ఆపుకొంటున్నట్లుగా వున్నది.

'చలి మరీ ఎక్కువైంది. మంచులో యిలా తడవటం మంచిది వెరా' పద. మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబెడతాను.



ఛ. వెధవ బ్రతుకు' అంటూ గొణుక్కుంది వెరా.

'ఏమైనా చెప్పండి. మాట్లాడండి. ప్లీజ్' అన్నాడు ఇవాన్.

'మీకో మాట చెప్పాలి'.

'చెప్పండి.'

'మాటలు రావటం లేదు.... ఎలా చెప్పాలో తెలియదు.' అంటూ రెండు చేతుల్లోనూ మొహం దాచుకొని బిగబట్టి ఏడ్చింది వెరా.

'ప్లీజ్. అలా ఏడవకండి. మీకు వచ్చిన కష్టమేమిటో చెప్పండి. నాకు చేతనైనంత సాయమూ చేస్తాను...'

కాస్సేపటికి వెక్కిళ్లాపుకుంటూ వెరా.

'ఐ లవ్‌యూ' అంది.

ఇవాన్ ఒక క్షణం భయంతో బిగుసుకుపోయాడు. అప్పటిదాకా ఈ మనుషులమీద అతడికున్న కృతజ్ఞతాభావం క్షణంలో మాయమైంది.

'ఎందుకు నేను సందేహిస్తున్నాను. నాకూ ఈవిడంటే యిష్టమేనే...' అనుకున్నాడు.

చెప్పదలుచుకున్నది చెప్పేసింతర్వాత వెరాకు మనసు తేలికపడింది.

ఆ తర్వాత ఇవాన్ జ్ఞాపకం చేసుకున్నాడు. ఆమె 'ఐ లవ్‌యూ' అన్న క్షణాన తనలో ఎన్ని పరస్పర విరుద్ధమైన భావాలు సంఘర్షించాయో..

'ఐ డోంట్ లవ్‌యూ' అనడానికి మనసొప్పలేదు. 'ఐ లవ్ యూ' అనీ చెప్పలేడు.

రెండు మాటల మధ్య నిల్చింది నిశ్శబ్దం.

'నేనిక్కడ వుండలేను. ఈ యిల్లు, ఈ వూరు. మీకు ప్రశాంతతలాగే కన్పిస్తున్నది గాని నేను బోరు కొట్టి చస్తున్నాను. అందరూ మంచివాళ్లే కాని ఆంబిషన్ లేని మనుషులు. మాటలకు ప్రతిస్పందించడం ఎట్లాగూ వీలుపడదు. 'వెరా గారూ, మీ దయకు నేను ఆ జన్మ కృతజ్ఞుణ్ణి. కాని నేను మీ ప్రేమకు మాత్రం అర్హుణ్ణి గాదు. చూడండి. నేను చాలా సాధారణమైన, క్షుద్రమైన మనిషిని. మీ వంటి వుత్తములతో సంబంధం పెట్టుకోలేను. మీరు అన్యథా భావించవద్దు. నన్ను క్షమించండి. మీరంటే నాకెంత కృతజ్ఞత వుందో, ఎంత గౌరవముందో నేను మాటల్లో చెప్పలేను. పదండి. ఇంటి దగ్గర వదిలిపెడతాను. అంటో లేచాడు ఇవాన్.

'అక్కర్లేదు. నేను వెడతాను.' అంది వెరా కన్నీళ్లను ఆపుకుంటూ.

అంత నిర్దయగా, కఠినంగా మాట్లాడినందుకు ఇవాన్‌కు తనమీద తనకు అసహ్యం వేసింది. ఆమె 'ఐ లవ్‌యూ' అన్నంత మాత్రాన ఒప్పుకోవటమేనా?.... కాని ఇప్పుడు కాకపోతే మరెప్పుడు చేసుకుంటాను? ఇంతకన్నా ఎక్కువగా ప్రేమించే అమ్మాయి మళ్లీ నాకు దొరుకుతుందా? ముప్పై ఏళ్లు వచ్చాయి. ఇప్పటికే ఆలస్యమైంది. ఈ అవకాశం కూడా జారిపోయాక నేను యిలాగే మధ్య వయస్సులోకి, వృద్ధాప్యంలోకి జారిపోనా...

వెరా గబగబా ముందర నడిచివెళుతోంది. 'ఆమె మనసులో ఎంత బాధుందో... ఎంతగా యిష్టపడిందో...ఛ. వెరా కన్నీళ్లకు రాళ్లయినా కరుగుతాయే: నాకు స్త్రీ హృదయం తెలియదు. ప్రేమ తెలియదు. ప్రణయం తెలియదు...'

ఇల్లు చేరగానే వెరా అతడి వైపన్నా చూడకుండా లోపలికి వెళ్లి తలుపు వేసుకుంది.

ఇవాన్ తిరిగి వెళుతూ దారిలో వెరా పాదాల గుర్తుల కోసం అన్వేషించాడు. తనను అంత గాఢంగా ప్రేమించిన మనిషికి 'నో' అని చెప్పగలిగాడు. గౌరవానికీ, కృతజ్ఞతకూ ప్రేమకూ ఏమీ సంబంధం లేదని మొదటిసారిగా తెలిసివచ్చింది.

వెరాను వదులుకున్నప్పుడే తనలోని ఒక విలువైన భాగం కూడా తనకు కాకుండా పోయింది. 'తనలో ఈ ప్రేమరాహిత్యానికి కారణం ఏమిటి?' అని ఆలోచించాడు ఇవాన్. ప్రేమరాహిత్యంలో హేతుబద్ధతా లేదు, మూర్ఖత్వమూ లేదు.

ప్రేమానుభావాన్ని జీవించలేని ఒక అశక్తత. సౌందర్యానికి, సచ్ఛీలతకు స్పందించలేని ఒక నిస్సహాయత... అవును మరి. రోజూవారి జీవిత సంఘర్షణలో, పెట్టే ఉద్యోగాలతో సంపాదించుకున్న నిరాసక్తత. ■